సాక్షి నిజామాబాద్

గురువారం । 18 । మే । 2023



బిల్లులను విడుదల చేయాలి

మధ్యాహ్న భోజన కార్మికులకు రావాల్సిన పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని యూనియన్ ప్రధాన కార్యదర్శి కోరారు.

- 9లో ▸



ప్రశాంతంగా పాలిసెట్

జిల్లా కేంద్రంలో బుధవారం పాలిసెట్ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. 5,510 మంది పరీక్షకు హాజరయ్యారు.

- 9లో ▸



వాతావరణం

ఎండ తీవ్రత పెరుగుతుంది. ఉక్కపోతగా ఉంటుంది. మధ్యాహ్నం వడగాలులు వీస్తాయి. రాత్రి ఆకాశం నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

20 మంది ఎస్సైలకు సీఐలుగా ప్రమోషన్లు ?

ఖలీల్‌వాడి: నిజామాబాద్ కమిషనరేట్ పరిధిలోని 2009, 2012 బ్యాచ్‌లకు చెందిన 20 మంది ఎస్సైలకు సీఐలుగా పదోన్నతులు రానున్నట్లు సమాచారం. జూలైలో ఇవ్వనున్న ప్రమోషన్ జాబితాలో జిల్లాకు చెందిన 20 మంది ఎస్సైల పేర్లు ఉన్నట్లు తెలిసింది. సీఐల సంఖ్య పెరిగితే ఇంకా కొంత మంది ఎస్సైలకు సీఐ పోస్టులు లభించే అవకాశాలున్నాయి. ప్రమోషన్ల జాబితా ముందు వరుసలో నగరంలోని 5వ టౌన్ ఎస్సై సాయినాథ్, 3వ టౌన్ ఎస్సై శ్రావణ్‌కుమార్, నవీపేట ఎస్సై రాజారెడ్డిలు ఉన్నారు. అంతేకాకుండా 2వ టౌన్ ఎస్సై పూర్ణేశ్వర్, 6వ టౌన్ ఎస్సై సాయికుమార్‌గౌడ్, ట్రాఫిక్‌లో పనిచేస్తున్న రాజేశ్వర్‌గౌడ్, ఎడపల్లి ఎస్సైతో పాటు పలువురికి పదోన్నతులు వచ్చే అవకాశం ఉన్నట్లు సమాచారం.

కిట్ల పంపిణీకి టెండర్ల ఆహ్వానం

నిజామాబాద్ సిటీ: జిల్లాలో ఫైలేరియా లింఫెడిమా కేసులకు అవసరమైన మార్బిడిటీ మేనేజ్‌మెంట్ కిట్ల పంపిణీకి టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుదర్శనం బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా మలేరియా కార్యాలయం పరిధిలో ఫైలేరియా లింఫెడిమా కేసులకు అవసరమైన 1,616 మార్బిడిటీ మేనేజ్‌మెంట్ కిట్స్ సరఫరా చేసేందుకు ఆసక్తి గల వారు ఈ నెల 20న సాయంత్రం 5 గంటల వరకు టెండర్లు వేయవచ్చన్నారు. పూర్తి వివరాలకు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

పార్టీ కార్యక్రమాలకే పరిమితం

- మంత్రి, ఎమ్మెల్యేలు ప్రజాసమస్యలను గాలికి వదిలేశారు
- డీసీసీ అధ్యక్షుడు మోహన్‌రెడ్డి



కమ్మర్‌పల్లి: జిల్లాకు చెందిన మంత్రి పాటు ఎమ్మెల్యేలు ప్రజా సమస్యలను పక్కన పెట్టి పార్టీ కార్యక్రమాలకే పరిమితమయ్యారని డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి విమర్శించారు. బుధవారం ఆయన కమ్మర్‌పల్లి మండలం హాసాకొత్తూర్‌లో హాథ్‌సే హాథ్ జోడో కార్యక్రమంలో భాగంగా ఉపాధి హామీ కూలీలను కలిసి మాట్లాడారు. ఎమ్మెల్యేలు జిల్లాకు చుట్టపుచూపుగా వచ్చి మిగిలిన సమయమంతా పార్టీ కార్యక్రమాలకు వినియోగిస్తున్నారని మండిపడ్డారు. ఉపాధి హామీ కూలీలకు సక్రమంగా కూలీ డబ్బులు రావడం లేదని, నెలల తరబడి ఆలస్యంగా వస్తున్నాయని ఈ సమస్యలను ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని ఎత్తేసే ప్రయత్నం చేస్తోందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, మండలాధ్యక్షుడు సుంకెట రవి, నాయకులు అబ్దుల్ రఫీ, పడిగెల ప్రవీణ గోపిడి లింగారెడ్డి, కుందేటి శ్రీనివాస్, రాజేశ్వర్, మహేందర్‌గౌడ్, బుచ్చి మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



ప్రచండ భానుడు



- నిప్పులకొలిమిని తలపిస్తున్న ఉష్ణోగ్రతలు
- ఏ వస్తువును ముట్టుకున్నా కాలిపోతున్నట్లు..
- వృద్ధులు, పిల్లలు, బాలింతలు, గర్భిణులు, బయట పనిచేసేవారు జర జాగ్రత్త

సూర్యుడు ప్రచండంగా చెలరేగిపోతున్నాడు. నిప్పులకొలిమిని తలపించేలా ఉగ్రరూపం చూపిస్తున్నాడు. ఉదయం 10 గంటలు దాటిందంటే ఎండ సుర్రుమంటోంది. బయటకు వెళ్లాలంటేనే జనాలు జంకుతున్నారు. పశుపక్ష్యాదులు వేసవికి అల్లాడిపోతున్నాయి. బుధవారం జిల్లాలో సగటు ఉష్ణోగ్రత 41.5 డిగ్రీలు నమోదైంది. నందిపేట మండలం తొండకూర్‌లో అత్యధికంగా 42 డిగ్రీలు, మెండోరాలో 41.8 డిగ్రీలు నమోదైంది. కాగా ఈ నెల 12న జిల్లాలో సగటు ఉష్ణోగ్రత 40.9 డిగ్రీలు, 13న 40.9, 14న 42.5, 15న 41.9, 16న 41.3 డిగ్రీల సగటు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఇది లా ఉండగా ఈ నెల 14న ముప్కాల్‌లో సీజన్‌లోనే అత్యధికంగా 45.1 డిగ్రీలు, జక్రాన్‌పల్లిలో 45 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఇంత వేడిమి నేపథ్యంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య నిపుణులు సూచనలు చేస్తున్నారు. వృద్ధులు, పిల్లలు, గర్భిణులు, బయట పనిచేసేవారు మరింత అప్రమత్తంగా ఉండాలని చెబుతున్నారు.

–సాక్షి ప్రతినిధి, నిజామాబాద్

బుధవారం జిల్లాలో నమోదైన ఉష్ణోగ్రతలు

గ్రామం	గరిష్టం				
తొండకూర్	42.0	ఏర్గట్ల	41.5	మోర్తాడ్	40.5
మెండోరా	41.8	జాకోరా	41.5	రెంజల్	40.5
ఎడపల్లి	41.8	జక్రాన్‌పల్లి	41.5	భీమ్‌గల్	40.4
సాలూర	41.7	బెల్లాల్	41.5	సి.హెచ్.కొండూర్	40.3
మచ్చర్ల	41.7	మగ్గిడి	41.3	కొనసముందర్	40.2
వేల్పూర్	41.6	ఇసాయిపల్లి	41.3	నిజామాబాద్ నార్త్	40.0
పెర్కిట్	41.6	మంచిప్ప	40.8	నిజామాబాద్ సౌత్	40.0
		కమ్మర్‌పల్లి	40.7	ముప్కాల్	40.0

ఎండ దెబ్బతో అవయవాలు విఫలం



- వేసవిలో ద్రవాహారానికి ప్రాధాన్యత ఇవ్వాలి
- శరీరంలో ఉప్పు, చక్కెర సమతుల్యంగా ఉండాలి
- జనరల్ ఫిజీషియన్, ప్రొఫెసర్, డాక్టర్ జలగం తిరుపతిరావు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : వేసవి ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు దాటిన నేపథ్యంలో ఎండదెబ్బ(వడదెబ్బ) తగలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని నిజామాబాద్ ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రొఫెసర్, జనరల్ ఫిజీషియన్ డాక్టర్ జలగం తిరుపతిరావు సూచిస్తున్నారు. 'సాక్షి' ఇంటర్వ్యూ ఆయన మాటల్లోనే..

ఎండదెబ్బతో శరీరంలో వేడిని నియంత్రించే విధానం విఫలమై ప్రాణాపాయ స్థితి ఏర్పడుతుంది. ప్రాథమిక అవయవాలు విఫలమయ్యేలా చేస్తుంది. సరైన మోతాదులో ద్రవపదార్థాలు తీసుకోకుండా బరువైన పనిని చేసినప్పుడు సమస్య ఏర్పడుతుంది. పిల్లలు, క్రీడాకారులు, అతిమూత్ర వ్యాధి ఉన్న వ్యక్తులు, మద్యం సేవించేవారు, అధిక సూర్యరశ్మి, వేడి అలవాటు లేనివారు ఎండదెబ్బకు గురవుతారు.

లక్షణాలు..

ఎండదెబ్బ తగిలిన వ్యక్తి అయోమయం నుంచి అపస్మారక స్థితి వరకు వెళతాడు. గుండె/నాడి కొట్టుకోవడం, వేగంగా/తక్కువగా శ్వాస తీసుకోవడం, ఎక్కువ లేదా తక్కువ రక్త పోటు, చెమట పట్టకపోవడం, చిరాకు, కంగారు, అపస్మారక స్థితి, తల తిరగడం లేదా తేలిపోవడం, తలపోటు, వికారం (వాంతులు), పెద్దవారిలో స్పృహ కోల్పోవడం ప్రధాన లక్షణాలు. ఎండదెబ్బ కొనసాగితే.. మానసికమైన కలత, శ్వాస ప్రక్రియ వేగంగా జరగడం, శరీర తిమ్మిరి, చేతులు, కాళ్లలో బాధాకరమైన ఈడ్పులు, అపస్మారక స్థితి ఉంటాయి.



- వేసవిలో ద్రవాహారానికి ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలి. ప్రతిరోజు కనీసం 8 నుంచి 10 గ్లాసుల నీటిని తాగాలి.
- శరీరంలో ఉప్పు, చక్కెర సమతుల్యంగా ఉండాలి. నిమ్మకాయ నీటిలో లేదా మజ్జిగలో కాస్త ఉప్పు కలుపుకొని తాగితే ఎంతో మంచిది. పండ్ల రసాలు తాగేటప్పుడు కూడా పంచదారకు బదులు కొంచెం ఉప్పు కలుపుకుంటే మేలు.
- ఓఆర్ఎస్ దగ్గర ఉంచుకోవాలి. నాలుక తడారిపోయినట్టు అనిపిస్తే, నీరసంగా అనిపించినా వెంటనే ఓఆర్ఎస్ నీటిలో కలుపుకుని తాగాలి.
- వేసవికాలంలో నారింజ, పుచ్చకాయ, నిమ్మకాయ, మామిడి, కీర దోస వంటి అధిక నీటి కంటెంట్ ఉన్న పండ్లను తినాలి.
- టీ, కాఫీలు వేసవిలో ఆ రెండింటినీ మానుకోవడం ముఖ్యం.
- ఆల్కహాల్, కూల్ డ్రింక్స్ కూడా తాగడం మానేయాలి.
- వేసవిలో అధిక ప్రోటీన్ ఉండే ఆహారాలను దూరం పెట్టాలి. ఎండలు ఎక్కువగా ఉన్నప్పుడు జీర్ణ ప్రక్రియ మందగిస్తుంది. కాబట్టి తాజా కూరగాయలతో వండిన ఆహారాలు తినడం మంచిది.
- రాత్రి మిగిలిపోయిన అన్నం, కూరలు ఉదయం లేచి తినడం వంటివి చేయకూడదు.

ప్రాథమిక చికిత్స..

ఎండదెబ్బ తగిలిన వ్యక్తిని వెంటనే చల్లబరచాలి. వీలైతే రోగిని చల్లని నీటిలో ముంచాలి (టబ్ వంటివి లభిస్తే). చల్లటి, తడిబట్టలలో చుట్టాలి. చల్లని తడి బట్టతో ఒళ్లంతా అద్దుతూ వుండాలి. రోగి శరీర ఉష్ణోగ్రత 101ఎఫ్ కు వచ్చినప్పుడు చల్లని నీటిని చల్లి గదిలో సౌకర్యంగా పడుకోబెట్టాలి. రోగి తాగ గలిగితే చల్లని పానీయాలు ఇవ్వాలి. ఎలాంటి మందులు ఇవ్వకూడదు. వెంటనే వైద్యులను సంప్రదించాలి.

ఎండదెబ్బ తగలకుండా..


బయట పనులు చేసేటప్పుడు ఎక్కువగా పానీయాలు తాగి శరీర ఉష్ణోగ్రతను సాధారణంగా ఉంచుకోవాలి. కెఫీన్, మద్యానికి దూరంగా ఉండాలి. అవి జల వియోజనాన్ని కలిగిస్తాయి. లేత రంగు, వదులైన దుస్తులను ధరించాలి. తరచూ నీరు తాగేందుకు, శరీర నీటి స్థాయిని తగినవిధంగా ఉండేలా విరామం తీసుకోవాలి. ఎండలో తిరిగేవారు ఎండదెబ్బ బారిన పడవచ్చు. చాలామంది ఆకలిని కోల్పోవడం, శక్తిని కోల్పోయి బలహీనంగా మారతారు. దీంతో ముఖ్యంగా పగటిపూట ఇంట్లోనే ఉండాలి.

పశువులు, గొర్రెలను నీడ పట్టున ఉంచాలి



- ఉదయం, సాయంత్రం వేళల్లో మేతకు తీసుకెళ్లడం మేలు
- జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి జగన్నాథ చారి

డొంకేశ్వర్(ఆర్మూర్): తీవ్రమైన ఎండలతో పాటు వడగాలుల ప్రభావంతో మనకే కాదు మూగజీవాలు కూడా ఇబ్బందులు పడుతున్నాయి. ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా మనుషులకు ఎండదెబ్బ తగులుతోంది. అలాంటిది బయట మేతకోసం సంచరించే పశువులు, గొర్రెలు, మేకలతో పాటు పక్షులు ఎంత అల్లాడుతున్నాయో చెప్పనక్కర్లేదు. మండుతున్న ఎండల బారి నుంచి మూగజీవాలను ఏ విధంగా కాపాడుకోవాలో జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి జగన్నాథ చారి 'సాక్షి'కి వివరించారు. ఆయన సలహాలు, సూచనలు..



- గొర్రెలు, మేకలు, గేదెలు, ఆవులను ఎక్కువగా ఎండలో తిప్పకూడదు. వీలైనంత వరకు చల్లని ప్రాంతాల్లో, నీడపట్టున ఉంచాలి. ఇంటి వద్ద రేకుల షెడ్డు ఉన్న వారు పైన వరిగడ్డి ఉంచితే వేడి ప్రభావం తగ్గుతుంది. వీలయితే ఫ్యాన్‌లు కూడా పెట్టాలి.
- మేతను ఎక్కువగా ఇంటి వద్దే అందించేలా ఏర్పాట్లు చేసుకోవాలి. బయటకు తీసుకెళ్లడం తప్పనిసరైతే, ఉదయం 6 నుంచి 10గంటల్లోపు తీసుకెళ్లాలి. మళ్లీ సాయంత్రం 5 దాటిన తర్వాత మరోసారి మేతకు తీసుకెళ్లాలి.
- వేసవిలో పశువులు ఎక్కువ మోతాదులో నీటిని తాగుతాయి. వాటికి సరిపడా చల్లని, శుభ్రమైన నీటిని అందించాలి. ఒక్కో గేదె 50 లీటర్ల నీళ్లు తాగేలా చూడాలి. మేత, దానా పచ్చి రూపంలో అందిస్తే బాగుంటుంది.
- ఇళ్లలో పెంచుకునే కుక్కలు, పిల్లుల విషయంలో జాగ్రత్తలు పాటించాలి. ఎల్లప్పుడూ నీడ పట్టున ఉంచి క్రమం తప్పకుండా ఆహారం, నీటిని అందించాలి. పక్షుల కోసం ఇంటి బయట గిన్నెలు, పాత్రల్లో నీటిని పోసి ఉంచాలి.
- ఒకవేళ పశువులు, గొర్రెలు, మేకలు, పెంపుడు కుక్కలు ఎండ ప్రభావానికి, ఎండదెబ్బకు గురయితే వాటి శరీరం వేడిగా, పొడిబారి ఉంటుంది. వెంటనే తడిబట్టతో తుడవాలి, లేదా కప్పి ఉంచాలి. ఆరోగ్యం క్షీణిస్తే వెంటనే స్థానిక పశువైద్య అధికారులకు సమాచారం అందించాలి. వెంటనే చికిత్స అందిస్తారు.



గర్భిణులు జాగ్రత్తలు పాటించాలి



డాక్టర్ శైలజ, గైనకాలజిస్ట్



నిజామాబాద్ సిటీ: వేసవిలో గర్భిణులకు ఇబ్బందికరంగా ఉంటుంది. మార్నింగ్ సిక్‌నెస్, బేబీ బంప్ భారం, ఎండల వేడి మరింత చికాకు పుట్టిస్తాయి. కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే గర్భిణులు సమ్మర్ సీజన్‌లో ఎలాంటి ఆరోగ్య సమస్యలు లేకుండా ప్రశాంతంగా ఉండొచ్చని గైనకాలజిస్ట్ డాక్టర్ శైలజ వివరించారు. గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆమె సలహాలు, సూచనలు..

బయటకు వెళ్లే సమయంలో..

గర్భిణులు సాధ్యమైనంత వరకు ఎండల్లో బయటకు వెళ్లకుండా జాగ్రత్తపడండి. బయటకు వెళ్లాల్సి వస్తే గొడుగు తీసుకువెళ్లాలి. సాధ్యమైనంత వరకు ఉదయం, సాయంత్రం పనులు చేసుకోవడంతో వడదెబ్బ నుంచి రక్షణ పొందడానికి వీలుంటుంది. ఎండలో బయటకు వెళ్లాల్సి వస్తే మినీ బ్యాటరీ ఫ్యాన్‌ను వెంట తీసుకెళ్లాలి.

తీసుకోవాల్సిన ఆహారం

మండే ఎండల్లో శరీరం డీహైడ్రేట్ కాకుండా ఉండాలంటే పానీయాలను తీసుకోవాలి. శరీరాన్ని లోపలి నుంచి చల్లగా ఉంచడానికి కొబ్బరి నీరు, మజ్జిగ, నిమ్మరసం తీసుకోవడం మంచిది. అంతే కాకుండా పుచ్చకాయ, పెరుగు వంటివి కూడా శరీరంలోని వేడిని తగ్గిస్తాయి. గర్భిణులు తక్షణ శక్తి కావాలంటే ఏబీసీ జ్యూస్ తాగడం మంచిది. ఇది శక్తినే కాదు శరీరంలోని మలినాలను బయటకు పంపుతుంది.



బ్యాటరీలు పేలే అవకాశం

-వివరాలు 8లో..

త్వరలో వర్సిటీకి కొత్త రిజిస్ట్రార్..

- నేటి నుంచి తరగతులు పున:ప్రారంభం
- పీహెచ్‌డీ అవార్డులపై విచారణకు సిద్ధంగా ఉండాలి
- అధ్యాపకులతో సమావేశంలో వీసీ ప్రొఫెసర్ రవీందర్‌గుప్తా

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ వర్సిటీ పాలకమండలి సహకారంతో క్యాంపస్‌కు చెందిన సీనియర్ ప్రొఫెసర్ ఒకరిని త్వరలో కొత్త రిజిస్ట్రార్‌గా నియమిస్తామని వీసీ రవీందర్ గుప్తా పేర్కొన్నారు. బుధవారం మధ్యాహ్నం తెయూ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజ్ సెమినార్ హాల్‌లో వర్సిటీ పరిధిలోని మెయిన్ క్యాంపస్(డిచ్‌పల్లి), సౌత్ క్యాంపస్(భిక్కనూర్), ఎడ్యుకేషన్ క్యాంపస్(సారంగపూర్)కు సంబంధించిన రెగ్యులర్, కాంట్రాక్టు అధ్యాపకులతో వీసీ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కరోనా కారణంగా విద్యాసంవత్సరం ఆలస్యంగా నడుస్తోందని, వేసవి సెలవులను 12 రోజులు తగ్గిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ఉన్నత విద్యామండలి జూలైలో పరీక్షల ఫలితాలు ప్రకటించాలని తెలిపిందని, అందుకే సెలవులు తగ్గింపు నిర్ణయం తీసుకున్నట్లు వీసీ పేర్కొన్నారు. అలాగే 2021 నుంచి ఇప్పటి వరకు వివిధ విభాగాల్లో పరిశోధక విద్యార్థులకు అందించిన పీహెచ్‌డీ డాక్టరేట్ అవార్డులపై త్వరలోనే విచారణ జరుగనుందన్నారు. ఆయా విభాగాల గైడ్స్ వివరాలతో సిద్ధంగా ఉండాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా పలువురు గైడ్స్ మాట్లాడుతూ.. నియమ నిబంధనలకు అనుగుణంగానే పరిశోధకులకు పీహెచ్‌డీ డాక్టరేట్ అవార్డులు ప్రకటించినట్లు తెలిపారు. విద్యార్థి నాయకులలో ఒకరంటే ఒకరికి పడక పీహెచ్‌డీ డాక్టరేట్‌లను వివాదం చేయడం తగదన్నారు. దీనివల్ల సామాన్య విద్యార్థులు నష్టపోతారని, నిరాశకు లోనవుతారని అభిప్రాయం వ్యక్తం చేశారు. కాగా త్వరలోనే కొత్త రిజిస్ట్రార్‌ను నియమిస్తామని వీసీ ప్రకటించడం చర్చనీయాంశంగా మారింది. వేసవి సెలవులతో ఇళ్లకు వెళ్లిపోయిన విద్యార్థులు ఈ మండే ఎండలకు మళ్లీ వచ్చి తరగతులకు హాజరవుతారా అనేది అనుమానమేనని పలువురు అధ్యాపకులు అభిప్రాయం వ్యక్తం చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న వీసీ రవీందర్

కొత్త రిజిస్ట్రార్ ఎవరు?

వీసీ అధ్యక్షతన జరిగిన అధ్యాపకుల సమావేశానికి పాలకమండలి ద్వారా రిజిస్ట్రార్‌గా నియామకమైన ప్రొఫెసర్ యాదగిరి హాజరు కాలేదు. యాదగిరి నియామకాన్ని వీసీ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఈసీ నిర్ణయాన్ని బేఖాతరు చేస్తూ ఓయూకు చెందిన ప్రొఫెసర్ నిర్మలదేవిని తెయూ ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా వీసీ నియమించారు. వీసీ ఒంటెద్దు పోకడలపై ఈసీ సభ్యులు ఆగ్రహించి, తమ అనుమతి లేకుండా ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా బాధ్యతలు నిర్వహించిన వారిపై కేసులు నమోదు చేస్తామని తీర్మానం చేశారు. దీంతో తత్వం బోధపడిన ఆమె ఐదు రోజుల్లోనే సొంత యూనివర్సిటీకి తిరిగి వెళ్లిపోయారు. అలాగే వీసీ ఆర్థిక అక్రమాలు, పీహెచ్‌డీ కుంభకోణాలపై విచారణ కోసం కమిటీని నియమించారు. దీంతో ఎటూ పాలుపోని వీసీ ఏకంగా రిజిస్ట్రార్ కార్యాలయం తాళం తెరవనీయకుండా చేశారు. ప్రభుత్వం ఏదొక నిర్ణయం తీసుకుంటే తప్ప తాను రిజిస్ట్రార్ కుర్చీలో కూర్చోనని యాదగిరి సొంత విభాగానికే పరిమితమయ్యారు. ఇప్పుడు ఏకంగా వర్సిటీకి చెందిన నలుగురు ప్రొఫెసర్లలో ఒకరిని ఒప్పించి ఈసీ సహకారంతో కొత్త రిజిస్ట్రార్‌గా నియమించాలని వీసీ ప్రయత్నాలు ప్రారంభించారు. దీంతో రిజిస్ట్రార్ కుర్చీలాట ఇప్పుడప్పుడే ముగిసేలా లేదని వర్సిటీ వర్గాల్లో చర్చించుకుంటున్నారు. తెయూలో ఇంత జరుగుతున్నా ప్రభుత్వం సరైన రీతిలో స్పందించడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఈసీ సభ్యుల మద్దతు కోసం..



రాజేందర్‌రెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న వీసీ

వర్సిటీకి కొత్త రిజిస్ట్రార్‌గా ప్రొఫెసర్ అరుణను నియమించడానికి వీసీ ప్రయత్నాలను ముమ్మరం చేశారు. ఈ మేరకు ఈసీ సభ్యులను కలిసి మద్దతు కోరుతున్నారు. బుధవారం ఈసీ సభ్యులు ప్రముఖ న్యాయవాదులు రాజేందర్‌రెడ్డి, ఎస్ఎల్‌శాస్త్రిలను కలిశారు. అనంతరం వీసీ 'సాక్షి'తో మాట్లాడుతూ.. ఈసీ తీర్మానించినప్పటికీ రిజిస్ట్రార్‌గా యాదగిరికి ఆర్డర్ లేకపోవడంతో ఆయన నియామకం చెల్లదన్నారు. అందుకే తెయూలో కంట్రోలర్‌గా విధులు నిర్వహిస్తున్న అరుణను రిజిస్ట్రార్‌గా నియమించాలనుకుంటున్నట్లు తెలిపారు. ఇందుకోసం సోమవారం రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపాల్ సెక్రెటరీ వాకాటి కరుణను హైదరాబాద్‌లో కలిశానన్నారు. ఈసీ సభ్యులను ఒప్పించాలని ఆమె సూచించారన్నారు. ఈసీ సభ్యులు వసుంధరదేవి, మారయ్యగౌడ్, గంగాధర్‌గౌడ్‌లను సంప్రదించాలని ప్రయత్నించినా వారు స్పందించలేదన్నారు. మిగతా సభ్యులు అందుబాటులో లేరన్నారు. ప్రొఫెసర్ అరుణను సంప్రదించగా ఈసీ ఆమోదం ఇస్తేనే రిజిస్ట్రార్‌గా బాధ్యతలు తీసుకుంటానని వీసీకి తెలిపినట్లు చెప్పారు.

వ్యవ'సాయం'లో ఏఈవోలు కీలకం



మాట్లాడుతున్న, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

సుభాష్‌నగర్: జిల్లాలో సాగు రంగమే ప్రధాన ఆధారం కావడంతో వ్యవసాయ విస్తీర్ణ అధికారులు (ఏఈవోలు) క్రియాశీలక పాత్ర పోషించాల్సిన అవసరం ఎంతైనా ఉందని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు సూచించారు. క్షేత్రస్థాయిలో అనునిత్యం రైతులను కలుస్తూ, వారి ప్రయోజనాలు కాపాడడమే పరమావధిగా పనిచేయాలన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరో పక్షం రోజుల్లో వానాకాలం పంటల సాగు ప్రారంభం కానున్న నేపథ్యంలో వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు, సిబ్బంది రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు అందించాలన్నారు. ముఖ్యంగా రైతులు వివిధ పంటలకు సంబంధించి నాణ్యతతో కూడిన విత్తనాలు ఎంపిక చేసుకునేలా చూడాలన్నారు. నకిలీ విత్తనాలతో రైతులు నష్టపోకుండా జాగ్రత్తగా వ్యవహరించాలని కలెక్టర్ ఆదేశించారు. అలాగే ఎరువుల విషయంలో రైతులు అనవసర ఆందోళనకు గురికాకుండా, సరిపడా అందుబాటులో ఉన్నాయని వారికి స్పష్టమైన భరోసా కల్పించాలన్నారు. రైతులు మోతాదుకు మించి ఎరువులు వాడకుండా చూడాలన్నారు. విత్తనాలు, ఎరువుల విషయంలో అప్రమత్తంగా వ్యవహరిస్తే ఎలాంటి ఇబ్బందులు లేకుండా సీజన్‌ను విజయవంతంగా పూర్తి చేసుకోగలుగుతామన్నారు. జిల్లా లో ఆయిల్ పామ్ సాగును పెంపొందించేందుకు వీలుగా రైతులకు ఈ పంట ద్వారా సమకూరే లాభాల గురించి వివరించాలని తెలిపారు. 4,600 ఎకరాల విస్తీర్ణంలో ఆయిల్ పామ్ సాగుచేయాలని జిల్లాకు నిర్దేశించిన లక్ష్యాన్ని పూర్తిస్థాయిలో సాధించేలా వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులు పరస్పరం సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారి తిరుమల ప్రసాద్, ఉద్యాన శాఖ అధికారి నర్సింగ్ దాస్, ఏడీఏలు, ఏవోలు, ఏఈవోలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

4,599 మందికి కంటి పరీక్షలు

కామారెడ్డి టౌన్: జిల్లాలో బుధవారం కంటి వెలుగు శిబిరాల్లో 4,599 మందికి కంటి పరీక్షలను నిర్వహించారు. అవసరం అయిన 359 మందికి కంటి అద్దాలను పంపిణీ చేశారు. జిల్లాలో ఇప్పటి వరకు 4,18,272 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా, 61,649 మందికి అద్దాలను అందజేశారు.

ఆవును కాపాడిన గో సేవకులు



సుభాష్‌నగర్: నగరంలోని నాందేవ్‌వాడలో ఓ ఆవు కుళాయి గుంతలో పడిపోయింది. అందులో నుంచి లేవలేని స్థితిలో కొట్టుమిట్టాడుతుండగా స్థానిక కార్పొరేటర్ ఎర్రం సుధీర్‌కు కాలనీవాసులు సమాచారమిచ్చారు. దీంతో వెంటనే గో సేవకులు వచ్చి ఆవును బయటికి తీసి కాపాడారు. హిందూ ఐక్యవేదిక కన్వీనర్ దాత్రిక రమేష్, హిందువాహిని నగర అధ్యక్షుడు శ్రీకాంత్, క్రాంతి, రాకేష్, శేషు పాల్గొన్నారు.

మత్స్యకార సొసైటీల ఎన్నికలు జరపాలి

డొంకేశ్వర్(ఆర్మూర్): జిల్లాలో ఇంకా 50 మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలకు ఎన్నికలు జరపాల్సి ఉందని, హై కోర్టు ఉత్తర్వుల ప్రకారం మూడు నెలల్లో ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయాలని జిల్లా మత్స్యశాఖ అధికారి రాజనర్సయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నిక జరగని సహకార సంఘాలు వారి ఓటరు జాబితాను జిల్లా కార్యాలయంలో అందజేసిన పక్షంలో ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. అనంతరం జిల్లా మత్స్య పారిశ్రామిక సంఘ ఎన్నికలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తామని తెలిపారు.

వడ్లు కొనడం లేదని ధర్నా



డొంకేశ్వర్: నిజామాబాద్ నగర శివారు ప్రాంతంలో మాసాని చెరువు కింద పండిన వడ్లను కొనుగోలు చేయడం లేదని రైతుకేత్ ఆధ్వర్యంలో బుధవారం శివాజీనగర్ చౌరస్తాలో ధర్నా నిర్వహించారు. తరుగుకు ఒప్పుకుంటేనే ధాన్యం కొనుగోలు చేస్తామని అధికారులు చెప్తున్నారని రైతులు ఆరోపించారు. కండిషన్ లేకుండా వడ్లను కొనుగోలు చేసేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

పుస్తకాల సరఫరా బాధ్యతపై ఎంఈవోల ఆగ్రహం

నిజామాబాద్‌అర్బన్: పాఠ్య పుస్తకాల సరఫరా బాధ్యతపై మండల విద్యాశాఖ అధికారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పుస్తకాలను జిల్లా కేంద్రం నుంచి మండల రిసోర్స్ కేంద్రాలకు సరఫరా చేయడంలో స్థానిక ఎంఈఓ బాధ్యత తీసుకోవాలని రవాణా ఖర్చులు చెల్లించాలని డీఈవో బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. మొదట ఖర్చు చేసి బిల్లులు పెట్టుకోవాలని పేర్కొన్నారు. దీనికి ఎంఈవోలు ఒప్పుకోవడం లేదు. తర్వాత బిల్లులు రావడంలో ఆలస్యం అయితే తాము ఇబ్బందులు పడుతామన్నారు. దీనిపై డీఈవో దుర్గాప్రసాద్‌ను వివరణ కోరగా రవాణా ఖర్చులు పెట్టుకొని బిల్లులు సమర్పిస్తే నిధులు విడుదల చేస్తామన్నారు.

బ్యాటరీలు పేలే అవకాశం

- ఎండాకాలంలో ఎలక్ట్రిక్ వాహనాలతో జాగ్రత్త అంటున్న నిపుణులు



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: ఎండాకాలం ఎలక్ట్రిక్ వాహనాల బ్యాటరీలు పేలిపోయే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. బ్యాటరీలు పేలిన పలు ఘటనల్లో మరణాలు సైతం సంభవిస్తూనే ఉన్నాయి. దీంతో చాలా అప్రమత్తంగా వ్యవహరించాలని నిపుణులు సూచిస్తున్నారు. వివిధ కంపెనీలు ఎలక్ట్రిక్ వాహనాలకు రెండు రకాల బ్యాటరీలను ఉపయోగిస్తున్నాయి. లిథియన్ అయాన్, లీడ్ యాసిడ్ అనే రెండు రకాలున్నాయి. ఇవి 8 నుండి 20 కిలోల బరువుంటాయి. లిథియన్ బ్యాటరీకి 3 నుంచి 4 గంటలు, లీడ్ యాసిడ్ బ్యాటరీకి 6 నుంచి 8 గంటల పాటు ఛార్జింగ్ పెట్టాలి. లిథియన్ బ్యాటరీకి మండే గుణం ఎక్కువ. అందువల్ల చార్జింగ్ సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలి.

ఎలక్ట్రిక్ వాహనాల బ్యాటరీని బయటకు తీసి చార్జింగ్ చేయడం వలన బ్యాటరీ వేడెక్కి పేలుడు సంభవించే అవకాశం ఉంటుంది. రాత్రిపూట చార్జింగ్ పెట్టి పడుకున్నప్పుడు సైతం బ్యాటరీ వేడెక్కి మంటలు వచ్చే అవకాశముంది. అలాగే బ్యాటరీ చార్జింగ్ పెట్టిన చోట నీళ్లు, చెమ్మ వస్తే, ఎర్తింగ్ వచ్చినా పేలే అవకాశాలు ఎక్కువ. ఇక ఎక్కువసేపు వాహనం నడిపిన వెంటనే చార్జింగ్ పెడితే బ్యాటరీపై ప్రభావం పడుతుంది. 40 డిగ్రీల ఉష్ణోగ్రతలో, ఎండ ప్రాంతంలో చార్జింగ్ పెట్టినా బ్యాటరీ వేడెక్కుతుంది. బ్యాటరీని వాహనంలో నుంచి తీసి చార్జింగ్ పెట్టడం వల్ల బ్యాటరీ మేనేజ్‌మెంట్ సిస్టమ్(బీఎంఎస్) దెబ్బతిని బ్యాటరీ వేడెక్కితుంది. అదే విధంగా బ్యాటరీకి తగిన మోటార్, మోటార్‌కు తగిన బ్యాటరీ లేకపోవడంతో కూడా ప్రమాదాలు సంభవించే అవకాశం ఉంది.

ఆటోకట్ ఆప్షన్ ఇవ్వడం లేదు..

బ్యాటరీ వేడెక్కితే వెంటనే ఎలక్ట్రిక్ వాహనం ఆగిపోయే ఫీచర్‌ను కొన్ని కంపెనీలు మాత్రమే ఇస్తున్నాయి. బ్యాటరీలో లోపం తలెత్తి వేడెక్కితే వెంటనే వాహనం డిస్‌ప్లేపై హెచ్చరించే ఫీచర్లు ఉన్నాయి. ఆటోకట్ విధానం ద్వారా వాహనం వెంటనే ఆగిపోయి ప్రమాదాన్ని నివారిస్తుంది. కొన్ని కంపెనీలు మాత్రమే ఇలాంటి ఆప్షన్లను అమర్చుతున్నాయి.

ఇలా చేస్తే ప్రమాదాలను నివారించవచ్చు..

ఎలక్ట్రిక్ వాహనాలకు ఎంసీబీ, కంట్రోలర్ అనే రెండు పరికరాలుంటాయి. ఇది బ్యాటరీకి అనుసంధానమై ఉంటుంది. బ్యాటరీని వాహనంలోనే ఉంచి చార్జింగ్ పెట్టడం వల్ల విద్యుత్ ఎక్కువగా సరఫరా జరిగినప్పటికీ, బ్యాటరీ వేడెక్కినప్పటికీ ఎంసీబీ, కంట్రోలర్లు నిలువరిస్తాయి. బ్యాటరీని వాహనంలో నుంచి తీయడం వల్ల బీఎంఎస్ రక్షణ వ్యవస్థ తొలగిపోతుంది. బ్యాటరీని నేలపై, నీళ్లు ఉన్నచోట చార్జింగ్ పెడితే పేలే ఆస్కారం ఉంటుంది.

సూచనల కోసం సంప్రదించాలి



ఎలక్ట్రిక్ వాహనాలు కొనాలనుకునేవారు సదరు కంపెనీల పూర్వ చరిత్ర తెలుసుకోవాలి. బ్యాటరీ, టెక్నాలజీ అంశాలు పరిశీలించాలి. ప్రతి వాహనం డిజైన్ ప్రభుత్వ నిబంధనల మేరకు తయారై ఉండాలి. లేని పక్షంలో చట్టపరంగా చర్యలు ఉంటాయి. నిబంధనల మేరకు లేని వాహనాలకు కొనవద్దు. ఎలక్ట్రిక్ వాహనాలకు సంబంధించి సలహాలు, సూచనలు కావాలంటే రవాణా శాఖ కార్యాలయా ల్లో సంప్రదించాలి.

– వెంకటరమణ, డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్

వాణిజ్య పన్నుల శాఖలో కలకలం!

- బోగస్ చలాన్‌ల స్కాంలో నలుగురి అరెస్టు
- స్పీడ్ పెంచిన సీఐడీ అధికారులు

ఖలీల్‌వాడి: బోధన్ కుంభకోణంలో తాజాగా నలుగురు అధికారుల అరెస్టుతో ఆ శాఖలో కలకలం రేగింది. బోగస్ చలాన్‌ల స్కాంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న వాణిజ్య పన్ను శాఖలో పని చేస్తున్న స్వర్ణలత, రాజయ్య, విజయ్‌కుమార్, సాయిలును మంగళవారం అరెస్ట్ చేసి కరీంనగర్‌లోని ఏసీబీ కోర్టులో హాజరు పర్చారు. దీంతో ఆ శాఖలో పని చేస్తున్న అధికారుల్లో ఆందోళన నెలకొంది. నకిలీ చలాన్ల కుంభకోణంపై 2017లో బోధన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. బోగస్ చలాన్లలను సృష్టించి రూ.231.22 కోట్లు ప్రభుత్వ ఖజానాకు గండికొట్టారు. ఈ కేసును పోలీసులు సీఐడీకి బదిలీ చేయగా అప్పుడు 17 మందిని అరెస్ట్ చేశారు. కాలంగా ఈ కేసు డీలాపడగా మళ్లీ సీఐడీ అధికారులు తెరపైకి తెచ్చారు.

వణికిపోతున్న అధికారులు

ఈ కుంభకోణంలో వాణిజ్యపన్నుల శాఖలో ఆరోపణలు ఎదుర్కొంటున్న 42 మంది అధికారులను ప్రశ్నించేందుకు సీఐడీ సిద్ధమవుతున్నట్లు తెలిసింది. బోధన్, నిజామాబాద్ జిల్లాలో పని చేసిన ముగ్గురు కమర్షియల్ ట్యాక్స్ అధికారులు(ఏసీటీవోలు), ఇద్దరు సూపరింటెండెంట్‌లు, ఇద్దరు డిప్యూటీ కమిషనర్లు, అడిటింగ్‌లోని ఓ అసిస్టెంట్ కమిషనర్‌ను విచారించనున్నట్లు తెలిసింది. వీరు ఇక్కడ పని చేసి సెంట్రల్ ఆఫీస్‌కు వెళ్లినట్లు సమాచారం. తాజాగా నలుగురు అరెస్ట్ కావడంతో మిగతా అధికారులు వణికిపోతున్నారు. సీఐడీ దూకుడు పెంచడంతో అధికారులు ఓ మాజీ ఐఏఎస్‌ను ఆశ్రయించగా అక్కడి నుంచి పెద్దగా స్పందన రాలేదని తెలిసింది.

ప్రధాన నిందితుడు శివరాజ్‌కు సంబంధించిన కాల్‌డేటా, అధికారులు, ఇతరులతో జరిగిన లావాదేవీల వివరాలను ఇప్పటికే సీఐడీ అధికారులు సేకరించారు.

కుంభకోణం జరిగింది ఇలా

వాణిజ్య పన్నుల శాఖలో బోగస్ చలాన్‌ల కుంభకోణం రెండు విధాలుగా జరిగినట్లు సీఐడీ పోలీసులు గుర్తించారు. బోధన్ సర్కిల్ పరిధిలోని వ్యాపారుల నుంచి కన్సల్టెంట్ శివరాజ్ పన్ను వసూలు చేసి సగం పన్నులు చెల్లించి మిగితా పన్నులు నొక్కేసినట్లు గుర్తించారు. వ్యాపారులు మొత్తం పన్ను చెల్లించినట్లు నకిలీ చలాన్లు ఇచ్చారు. దీంతో వాణిజ్య పన్నుల శాఖలో ఉన్న అధికారులు శివరాజ్‌తో కుమ్మక్కై ఇచ్చిన నకిలీ చలాన్లతో మొత్తం పన్ను చెల్లించినట్లు వ్యాట్ పోర్టల్‌లో వివరాలను పొందుపర్చారు. వ్యాపారుల నుంచి మొత్తం సొమ్ము తీసుకొని కొంత అధికారులకు మరి కొంత శివరాజ్ జేబులో వేసుకున్నాడు.

మృతి చెందిన శివరాజ్ దంపతులు

కుంభకోణంలో కీలక పాత్ర పోషించిన శివరాజ్ మూడేళ్ల క్రితం మృతి చెందాడు. కొన్ని రోజుల కు ఆయన భార్య మృతి చెందగా కుమారుడు సింహాద్రి వెంకట సునీల్ జైలులో ఉన్నట్లు సమాచారం.

31లోగా మిల్లింగ్ పూర్తి చేయాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ చంద్రమోహన్

కామారెడ్డి క్రైం : ఈనెల 31లోగా రైస్‌మిల్ యజమానులు మిల్లింగ్ పూర్తి చేయాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్ అన్నారు. బుధవారం కామారెడ్డి కలెక్టరేట్‌లో సీఎంఆర్ లక్ష్యాలపై రైస్‌మిల్లుల యజమానులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజువారి లక్ష్యానికి అనుగుణంగా మిల్లింగ్ చేపట్టాలన్నారు. లక్ష్యానికి అనుగుణంగా మిల్లింగ్ చేయని రైస్‌మిల్లుల యజమానులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డీఎస్‌వో పద్మ, సివిల్ సప్లయ్ డీఎం అభిషేక్ సింగ్, ఎఫ్‌సీఐ డీఎంలు, జిల్లా రైస్ మిల్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల సమ్మె నోటీస్



సమ్మె నోటీస్‌ను అందజేస్తున్న డీలర్లు

కామారెడ్డి క్రైం : తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైనందున జూన్ 5 నుంచి సమ్మెకు వెళ్తున్నట్లు రేషన్ డీలర్ల జేఏసీ ప్రతినిధులు తెలిపారు. బుధవారం వారు కామారెడ్డి కలెక్టరేట్‌కు వచ్చి సమ్మె నోటీస్‌ను అదనపు కలెక్టర్ చంద్రమోహన్, డీఎస్‌వో పద్మకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డీలర్లకు గౌరవ వేతనం, దిగుమతి హమాలీ చార్జీలు, కరోనా సమయంలో విధి నిర్వహణలో కరోనా సోకి చనిపోయిన 98 మంది డీలర్ల కుటుంబాలకు ఎక్స్‌గ్రేసియా రూ. 25 లక్షలు ఇవ్వాలని తదితర డిమాండ్లతో నోటీసు అందజేశారు. రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు గౌరిశెట్టి రాజు, ఉపాధ్యక్షులు, వర్కింగ్ ప్రెసిడెంట్ శంకర్‌రావు, మాజీ అధ్యక్షుడు నాగం సురేందర్, వివిధ మండలాల రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

'భారతి సిమెంట్ సరైన ఎంపిక'



ధర్పల్లి: సిమెంట్ తయారీలో లేటెస్ట్ టెక్నాలజీ పద్ధతులను వినియోగిస్తూ తిరుగులేని సంస్థగా ఎదుగుతున్న భారతి సిమెంట్ అల్ట్రాఫాస్ట్ పేరుతో ఫాస్ట్ సెట్టింగ్ సిమెంటును తెలంగాణలో విడుదల చేసిందని సంస్థ నిజామాబాద్ మేనేజర్ మీర్జా తెలిపారు. ధర్పల్లిలోని శ్రీ వెంగమాంబ నరసింహస్వామి సిమెంట్ షాపులో తాపీ మేస్త్రీలతో బుధవారం ఆయన సమావేశం నిర్వహించారు. వినియోగదారులు కోరుకునే విధంగా నాణ్యమైన సిమెంటును అందించడంలో భారతి సిమెంట్ ఎప్పటికప్పుడు ముందుంటుందని పేర్కొన్నారు. మార్కెట్లో లభించే ఇతర సిమెంటుతో పోలిస్తే భారతి అల్ట్రా ఫాస్ట్‌తో నిర్మాణ ప్రక్రియ చాలా వేగవంతంగా పూర్తి అవుతుందని, భవనాల స్లాబులు, పిల్లర్లు, వంతెనలు, రహదారుల నిర్మాణానికి అల్ట్రా ఫాస్ట్ సరైన ఎంపిక అని చెప్పారు. అల్ట్రా ఫాస్ట్ వినియోదారులకు ఉచిత సాంకేతిక సహాయం అందజేస్తామని, భవనాల స్లాబ్ కాంక్రీట్ నిర్మాణ సమయంలో భారతి సిమెంట్ నిపుణులైన ఇంజినీర్లు సైట్ వద్దకే వచ్చి సహాయపడతారని వివరించారు. అనంతరం మండలానికి చెందిన 50 మంది మేస్త్రీలకు భారతి సిమెంట్ సంస్థ తరపున రూ.లక్ష ఉచిత ప్రమాద బీమా బాండ్ పత్రాలను అందజేశారు. డీలర్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆడపిల్లలను విక్రయిస్తే కేసులు



మాట్లాడుతున్న రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు అరికెళ్ల దేవయ్య

కామారెడ్డి క్రైం: ఆడపిల్లలను విక్రయిస్తే కేసులు నమోదు చేయాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు అరికెళ్ల దేవయ్య అన్నారు. బుధవారం ఆయన కామారెడ్డికి వచ్చారు. ఆయనకు కలెక్టర్ జితేష్ వి పాటిల్, రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్ పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం కలెక్టరేట్‌లో జిల్లా బాలల సంరక్షణ యూనిట్, ఐసీడీఎస్ ఆధ్వర్యంలో జరిగిన బాలల హక్కులు, సంరక్షణ కోసం తీసుకోవలసిన చర్యలపై సమీక్షలో పాల్గొని మాట్లాడారు. ఆడపిల్లలను విక్రయించడం నేరమన్నారు. బాలల హక్కులను పరిరక్షించేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో పక్కాగా పర్యవేక్షణ చేయాలని సూచించారు. సంరక్షణ కేంద్రాల్లో ఉంటున్న బాలలను తల్లిదండ్రుల్లా చూసుకోవాలన్నారు. వసతి గృహాల్లో ఉంటున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలన్నారు. ఈ సందర్భంగా బాలల హక్కులు, సంరక్షణకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కలెక్టర్ జితేష్ వి పాటిల్, శిక్షణ కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, అడిషనల్ ఎస్పీ అన్యోన్య, సీడబ్ల్యూసీ చైర్మన్ సత్యనారాయణ రెడ్డి, డీసీపీవో స్రవంతి, జిల్లా కార్మిక అధికారి సురేంద్ర కుమార్, డీఎంహెచ్‌వో లక్ష్మణ్ సింగ్ పాల్గొన్నారు.

కల్వర్టు పనులు ప్రారంభం

సాక్షి ఎఫెక్ట్..



కామారెడ్డి అర్బన్ : పట్టణంలోని పంచముఖి హనుమాన్ దేవాలయం వద్ద రైల్వే అండర్ డ్రెయినేజీతో రోడ్డు కొట్టుకుపోయి అధ్వానంగా తయారైన విషయాన్ని ఈనెల 5న 'సాక్షి'లో కథనం ప్రచురించగా ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించారు. మరమ్మతులు ప్రారంభించారు. గతంలోనే ఈ రోడ్డుకు రూ. 2 కోట్లు మంజూరు కాగా టెండర్ ఖరారైంది. కాని పనులు చేపట్టడంలో జాప్యం జరిగింది. ఆర్‌అండ్‌బీ డీఈ శ్రీనివాస్ మాట్లాడుతూ పాత బస్టాండ్ నుంచి రంగంపేట రైల్వే గేటు వరకు సింగిల్‌రోడ్డును డబుల్ రోడ్డు చేయడంతో పాటు కల్వర్టులను విస్తరిస్తామన్నారు.

క్రైం కార్నర్

ఆస్తి పంచడం లేదని ఆత్మహత్యాయత్నం

దోమకొండ: తల్లిని గెంటేసి ఇంటికి తాళం వేసిన ఘటనలో మరో ట్విస్ట్ చోటుచేసుకుంది. దోమకొండ మండలం సంఘమేశ్వర్ గ్రామానికి చెందిన బైకరి లచ్చవ్వ పెద్ద కుమారుడు పెద్ద నర్సయ్య అతడి కుమారులు మంగళవారం ఆస్తి పంపకం విషయంలో తల్లి లచ్చవ్వను ఇంట్లో నుంచి గెంటివేసి తాళం వేసిన విషయం తెలిసిందే. అడ్డు వచ్చిన తమ్ముడు చిన్న నర్సయ్యపై కూడా దాడి చేశారు. ఈ ఘటనలో బుధవారం పెద్ద నర్సయ్య కుమారుడైన నరేష్ తమ ఆస్తి పంపకం విషయంలో నానమ్మ, బాబాయి ఇబ్బందులకు గురిచేస్తున్నారని కుల పెద్దలు చెప్పినా వినడం లేదని ఆరోపిస్తూ గ్రామ శివారులో సెల్ఫీ వీడియో తీసుకొని పురుగుల మందు తాగాడు. తమకు ఉమ్మడి ఇల్లు, వ్యవసాయభూమి ఉందని దానిని పంచుకుందామంటే నానమ్మ, బాబాయి కుదరనీయడం లేదన్నారు. తన చావుతోనైనా ఆస్తి పంపకాలు జరుగుతాయని పేర్కొంటూ పురుగుల మందు తాగాడు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు అతడిని వెంటనే సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఎలాంటి ప్రమాదం లేదని, చికిత్స అందుతుందని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్సై సుధాకర్ తెలిపారు.

చెరువులో పడి బాలుడి మృతి

మోపాల్: మండలంలోని సిర్‌పూర్ చెరువులో పడి ముదక్‌పల్లికి చెందిన ఒల్లెపు రాజు(16) మృతి చెందినట్లు ఎస్సై మహేశ్ తెలిపారు. రాజు మోపాల్‌లో నరేష్ వద్ద గత ఏడాది నుంచి గేదెల కాపరిగా పనిచేస్తున్నాడు. మంగళవారం గేదెలను మేపడానికి సిర్‌పూర్ గ్రామ చెరువు సమీపానికి వెళ్లాడు. స్నానం కోసం చెరువులో దిగి మునిగి చనిపోయాడు. మృతుడి తల్లి ఎల్లవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

సాంపల్లి తండాకు చెందిన ఒకరు..

డిచ్‌పల్లి: మండలంలోని సాంపల్లి తండాకు చెందిన బదావత్ తార్య (40) గ్రామశివారులోని చెరువులో పడి మృతిచెందినట్లు ఎస్సై గణేష్ తెలిపారు. తార్య తండాకు చెందిన వారి పశువు(గేదె)లను కాసేవాడు. బుధవారం ఉదయం గేదెలను తోలుకుని వెళ్లాడు. మధ్యాహ్నం ఎండకు గేదెలు చెరువునీటిలో దిగాయి. అవి బయటకు రాకపోవడంతో తార్య చెరువు నీటి వద్దకు వెళ్లి వాటిని తోలేందుకు యత్నించాడు. ప్రమాదవశాత్తు నీటిలో పడిపోయాడు. చెరువులో పెద్ద పెద్ద మొరం గుంతలు ఉండటం, అతడికి ఈత రాకపోవడంతో నీటిలో మునిగిపోయాడు. అక్కడే చెరువులో చేపలు పడుతున్న మత్స్యకారులు గమనించి తార్యను నీటిలో నుంచి బయటకు తీశారు. అయితే అప్పటికే నీళ్లు మింగిన తార్య మృతి చెందాడు. మృతుడి చెల్లెలు నీల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

బాల్కొండ: మండలంలోని చిట్టాపూర్ శివారులో జాతీయ రహదారి 44 పక్కన గల పంట పొలాల్లో బుధవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం పూర్తిగా కుళ్లిపోయిన స్థితిలో లభించింది. ఎస్సై గోపి తెలిపిన వివరాలు.. కాయపల్లి శివన్న పొలంలో సుమారు 25 నుంచి 30 ఏళ్ల వయస్సు గల యువకుడి మృతదేహం కనిపించింది. మృతుడి ఒంటిపై దుస్తులు లేవు. కుడి చేయికి కడెం, చెవికి రింగు ఉన్నాయి. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

జీవితంపై విరక్తితో ఆత్మహత్య

ఖలీల్‌వాడి: నగరంలోని నాందేవ్‌వాడకు చెందిన మహంకాళి సాయిబాబా(33) ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై శ్రావణ్‌కుమార్ తెలిపారు. సాయిబాబా మెకానిక్ పని చేస్తూ జీవిస్తాడు. మద్యానికి బానిసై జీవితంపై విరక్తి చెంది మంగళవారం రాత్రి ఉరి వేసుకున్నాడు.

చోరీ కేసులో నలుగురి అరెస్ట్

- రూ.ఐదు లక్షల సొత్తు రికవరీ
- వివరాలు వెల్లడించిన ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి

కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రంలోని కేసీఆర్ కాలనీలో గత నెల 28న రాత్రి జరిగిన దొంగతనం కేసును పట్టణ పోలీసులు ఛేదించారు. రాత్రిపూట ఇంట్లోకి చొరబడి దొంగతనానికి పాల్పడిన నలుగురు వ్యక్తులను అరెస్ట్ చేసి బంగారం, నగదు రికవరీ చేశారు. జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి వివరాలు వెల్లడించారు. పట్టణంలోని లిటిల్ స్కాలర్స్ స్కూల్ ప్రాంతంలో ఉన్న కేసీఆర్ కాలనీకి చెందిన అలకొండ సంతోష్ రెడ్డి ఇంట్లో నిద్రిస్తుండగా అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లోకి చొరబడ్డారు. 6.4 తులాల బంగారు ఆభరణాలు, రూ లక్ష నగదు, నాలుగు సెల్‌ఫోన్‌లను ఎత్తుకెళ్లారు. మరుసటి రోజు సంతోష్ రెడ్డి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించారు. సీసీ కెమెరాలను పరిశీలించగా నలుగురు రెండు బైకులపై వచ్చి దొంగతనానికి పాల్పడినట్లు గుర్తించారు. సీసీ కెమెరాలు, కొత్తగా వచ్చిన సీఈఐఆర్ టెక్నాలజీ, సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా దొంగతనానికి పాల్పడిన వ్యక్తులు హైదరాబాదులోని దమ్మాయిగూడ శామీర్‌పేటకు వెళ్లినట్లు గుర్తించారు. వారిని మంగళవారం అరెస్టు చేసి విచారించగా నేరం అంగీకరించినట్లు ఎస్పీ తెలిపారు. నిందితులను అదే ప్రాంతానికి చెందిన మహమ్మద్ ఫిరోజ్, బొమ్మని రాములమ్మ అశోక్, సదల భరత్‌కుమార్, తెనుగు మహేందర్‌గా గుర్తించారు. నిందితుల్లో ఫిరోజ్ పాత నేరస్తుడు. హైదరాబాద్, విజయవాడలలో జరిగిన పలు కేసుల్లో నిందితునిగా ఉన్నట్లు ఎస్పీ తెలిపారు. నిందితుల వద్ద నుంచి చోరీకి గురైన 6.4 తులాల బంగారు ఆభరణాలు, రూ.లక్ష నగదు, నాలుగు సెల్‌ఫోన్‌లు సహా మొత్తం రూ.5 లక్షల సొత్తును రికవరీ చేసినట్లు ఎస్పీ వెల్లడించారు. వారిని రిమాండ్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు. కేసు ఛేదనలో విశేషంగా కృషి చేసిన డీఎస్పీ సురేష్, పట్టణ ఎస్‌హెచ్‌వో నరేష్, సీసీఎస్ సీఐ మల్లేష్ గౌడ్, టౌన్ ఎస్సైలు రాజు, సాయిరెడ్డి, సీసీఎస్ ఎస్సై ఉస్మాన్, ఏఎస్‌ఐ రాజేశ్వరరావు, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

ధాన్యం బస్తాల లారీ బోల్తా



నాగిరెడ్డిపేట: మండలంలోని తాండూర్‌లో గల కొనుగోలు కేంద్రం నుంచి ధాన్యం బస్తాల లోడుతో బయలుదేరిన లారీ బుధవారం మండలంలోని గోపాల్‌పేట సమీపంలో అదుపు తప్పి బోల్తా పడింది. మండలంలోని తాండూర్‌లోని కొనుగోలు కేంద్రం నుంచి 630బస్తాల లోడుతో లారీ భిక్కనూరు మండలంలోని బస్వాపూర్‌లో గల రైస్‌మిల్లులకు బయల్దేరింది. కమాన్‌పట్టీలు విరిగిపోవడంతో లారీ బోల్తా పడిందని స్థానికులు తెలిపారు. విషయం తెలుసుకున్న తాండూర్ సొసైటీ సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని ధాన్యం బస్తాలను మరోలారీలో నింపి రైస్‌మిల్లుకు పంపించారు.

దాడి ఘటనలో కేసు

ఖలీల్‌వాడి: నగరంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో డాక్టర్ పై దాడి, అద్దాలు ధ్వంసం చేసిన ఘటనలో కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు తెలిపారు. హాస్పిటల్ సూపరింటెండెంట్ ప్రతిమారాజ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ప్రమాదవశాత్తు పంటల దగ్ధం



కాలిపోయిన పంటను పరిశీలిస్తున్న అధికారులు

లింగంపేట: మండలంలోని కన్నాపూర్ గ్రామానికి చెందిన ఎరుకల ఎల్లవ్వ కౌలుకు తీసుకుని సాగు చేసిన వరి పంట అగ్ని ప్రమాదంలో కాలిపోయింది. రెండు రోజుల వ్యవధిలో పంట కోయాలనుకుంటే.. మంగళవారం సాయంత్రం కాలిపోయిందని బాధితురాలు వాపోయింది. కౌలు చేసిన 38 గుంటల్లో సగం వరకు కాలిపోయినట్లు తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారా.. ప్రమాదవశాత్తు కాలిపోయిందా అని సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. విషయాన్ని ఏవో అనిల్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లగా ఏఈవో రమ్య పంట చేనుకు వెళ్లి పరిశీలించినట్లు తెలిపారు. సుమారు పది గుంటల వరకు కాలిపోయినట్లు తెలిపారు.

మొక్కజొన్న పంట..

బాన్సువాడరూరల్: మండలంలోని పులిగుండు తండాకు చెందిన ఇస్యానాయక్ 4.20 ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగు చేశాడు. కోతకొచ్చిన పంటలో సుమారు 1.20 ఎకరాలు బుధవారం జరిగిన అగ్ని ప్రమాదంలో కాలిపోయింది. షార్ట్‌సర్క్యూట్‌తో ప్రమాదం జరిగినట్లు అధికారులు నిర్ధారించారు. కాలిపోయిన పంటను ఏఈవో కొండ మీన పరిశీలించారు.